
సాక్షి
మెదక్
మంగళవారం ׀ 22 ׀ జూలై ׀ 2025



**అడ్డగోలు నిబంధనలతో..**
ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు అధికారులు బిల్లులు నిలిపివేసి మార్కింగ్ చేశారు. వివరాలు 8లో ▸



**విద్యార్థినులకు అస్వస్థత**
మోర్గి ప్రభుత్వ మోడల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వివరాలు 8లో ▸



**వరి వైపు.. రైతుల చూపు**
వానాకాలం సీజన్‌లోనూ రైతులు ఎక్కువగా వరి పంట వైపు మొగ్గు చూపుతున్నారు. వివరాలు 9లో ▸

## న్యూస్‌రీల్

### సింగూరుకు వరద



**పుల్‌కల్(అందోల్):** గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సింగూరులోకి వరద పోటెత్తుతుంది. సోమవారం డ్యాంలోకి 3,503 క్యూసెక్కుల ప్రవాహం చేరిందని ప్రాజెక్టు ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. డ్యాం పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 29.917 టీఎంసీలకు గాను ప్రస్తుతం 19.669 టీఎంసీల నీరుందని చెప్పారు. ప్రాజెక్టు నుంచి పంట కాలువకు 60 క్యూసెక్కులు, తాలెల్మ ఎత్తిపోతలకు 33, జంట నగరాల తాగునీటికి 80, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు వదులుతున్నారు.

### రేపు ఖేడ్‌కు మంత్రి దామోదర రాక

**నారాయణఖేడ్:** వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈనెల 23న బుధవారం నారాయణఖేడ్ నియోజకవర్గంలో పర్యటించనున్నారని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఖేడ్, సిర్గాపూర్ మండల కేంద్రాల్లో నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేయడంతో పాటు ఖేడ్‌లో బైపాస్ రోడ్డు పనులు, సిర్గాపూర్ పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### ఎన్ని నిధులు తెస్తారో మంత్రి చెప్పాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్:** మంత్రి దామోదర రాజనర్సింహ ఖేడ్ నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులు తెస్తారో చెప్పాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఖేడ్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సిర్గాపూర్ మండల కేంద్రంలో గతంలో తమ ప్రభుత్వ హయాంలో మంజూరైన ఆస్పత్రిని ప్రారంభించడానికి త్వరలో మంత్రి రానున్న నేపథ్యంలో ఇప్పటివరకు మంజూరు చేసిన నిధులు, ముమ్ముందు తీసుకొచ్చే నిధుల వివరాలను వివరించి పర్యటించాలన్నారు. సమావేశంలో సిర్గాపూర్ మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మాధవరావు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్‌బుజ్జి, మనూరు మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు విఠల్‌రావు, నాయకులు నగేష్, ప్రభాకర్ కురుమ, ముజిమ్మిల్, మల్గొండ తదితరులు పాల్గొన్నారు.

### విలీన గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్

**జహీరాబాద్ టౌన్:** జహీరాబాద్ మున్సిపాలిటీలో విలీనమైన ఐదు గ్రామ పంచాయతీ పరిధిలో గల గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని శ్రామిక్ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణానికి దగ్గరలో ఉన్న పస్తాపూర్, రంజోల్, అల్లీపూర్, చిన్నహైదరాబాద్, హోతి(కె) ఐదు పంచాయతీలను 2019లో మున్సిపాలిటీలో విలీనం చేశారన్నారు. అప్పటి నుంచి ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనులు నిలిచిపోయాయని వాపోయారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని ఉపాధి హామీ పనులు చేపట్టాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**నర్సాపూర్ రూరల్:** అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ అదెప్ప సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ 1, కామర్స్ 2, ఇంగ్లిష్ 1 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పైన పేర్కొన్న పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీలకు 55 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు ఉండాలన్నారు. సెట్, నెట్, పీహెచ్‌డీతో పాటు బోధనలో అనుభం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 22, 23 తేదీలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

# పల్లెల్లో స్థానిక సందడి

- ఎన్నికల నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు
- ఇప్పటికే రిటర్నింగ్ అధికారులకు శిక్షణ పూర్తి
- సన్నద్ధమవుతున్న రాజకీయ పార్టీలు

**మెదక్‌జోన్:** స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ 30లోగా నిర్వహించాలని హైకోర్టు ఆదేశించడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని, అందుకు సంబంధించిన సామగ్రిని సిద్ధం చేసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ ఆదేశించటంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

**మూడు విడతల్లో..**

జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు, 492 గ్రామ పంచాయతీలు, 4,220 వార్డులు, 190 ఎంపీటీసీలు, 21 జెడ్పీటీసీ స్థానాలు ఉండగా, 5,24,471 మంది ఓటర్లు ఉన్నారు. కాగా సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి 18 నెలలు గడిచిపోయిన నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మొదటగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు



నిర్వహించి, అనంతరం పంచాయతీ, మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిసింది. కాగా ఇప్పటికే ఓటరు జాబితా సవరణను సైతం అధికారులు సిద్ధం చేసి ఉంచారు. కాగా గ్రా మాలు, వార్డుల వారీగా రిజర్వేషన్లు తేలిన అనంతరం ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. కాగా జిల్లాలో సర్పంచ్ ఎన్నికలు మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు మాత్రం ఒకేసారి జరగనున్నాయి. ఇదిలాఉండగా పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణ కోసం ఇప్పటికే రిటర్నింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వగా, ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వాల్సి ఉందని సంబంధిత అధికారులు తెలిపారు.

### పట్టు నిలుపుకునేందుకు ప్రయత్నాలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు నిలుపుకునేందుకు ఆయా పార్టీల నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇటీవల జిల్లాలో జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకొని అధికార కాంగ్రెస్ దూకుడు పెంచింది. ఇటీవల తెలంగాణ భవన్ వేదికగా కాంగ్రెస్‌ను వీడి హరీశ్ రావు, కేటీఆర్‌ల సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. దానికి బదులుగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఎమ్మెల్యే రోహిత్ రావు మెదక్‌లో బహిరంగ సభను ఏర్పాటు చేసి బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలను పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. అలాగే ఈనెల 18న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎంపీ రఘునందరావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి మెదక్‌లో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

# పల్లె బడిలో ఏఐ పాఠాలు



- ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వరం
- కార్పొరేటుకు దీటుగా ఆధునిక బోధన
- జిల్లాలో రెండో దశలో 170 స్కూళ్ల ఎంపిక
- త్వరలో ఒక్కో స్కూల్‌కు ఐదు కంప్యూటర్లు

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు **603**
ప్రస్తుతం ఏఐ బోధన కొనసాగుతున్నవి **21**
రెండో దశలో అమలయ్యేవి **170**

**రామాయంపేట(మెదక్):** ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత్రిమ మేధ (ఏఐ)ను పరిచయం చేసింది. ప్రధానంగా చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. వారంతా విద్యలో రాణించడమే కాకుండా నైపుణ్యవంతులుగా మారేలా చర్యలు తీసుకొంటుంది. ఈ క్రమంలో మొదటి విడతగా జిల్లాలోని 21 స్కూళ్లలో ఏఈ తరగతులు ప్రారంభించింది. ఇందులో మూడు నుంచి ఐదో తరగతి విద్యార్థులు శిక్షణ పొందుతుండగా, విజయవంతంగా కార్యక్రమం కొనసాగుతుంది.

**50 మంది కంటే ఎక్కువ ఉన్న స్కూళ్లు..**

రెండో దశలో కనీసం 50 మందికిపైగా విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలల్లో ఏఐ అమలు చేయనున్నారు. ఈమేరకు ఎంపిక చేసిన పాఠశాలల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చిన అనంతరం కార్యక్రమం ప్రారంభం కానుంది. వచ్చేనెలలో ఐదు చొప్పున కంప్యూటర్లు, ఇతర సామగ్రి మంజూరు కానుందని తెలిసింది. 50 మంది కంటే ఎక్కువ విద్యార్థులున్న స్కూళ్లు జిల్లాలో 170కి పైగా ఉన్నట్లు సమాచారం. ఏఐ పాఠాల పట్ల విద్యార్థులు ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారని, ఈమేరకు స్కూళ్లలో వారి హాజరుశాతం పెరిగిందని పలువురు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఏఐతో అన్ని సబ్జెక్టులు బోధించడంతో పాటు ప్రధానంగా సైన్స్, గణితంలో వారి నైపుణ్యాన్ని అంచనా వేసి ప్రత్యేకంగా రూపొందించిన అభ్యాస ప్రణాళికను అందజేస్తున్నట్లు చెప్పారు.

**ఉచిత నెట్ సదుపాయం**

పాఠశాలల్లో ఏఐ పాఠాలు బోధించడానికి ఇంటర్‌నెట్ తప్పనిసరి. మారుమూల గ్రామాల్లో నెట్ కవరేజ్ సక్రమంగా ఉండకపోతే ఇబ్బందే. ఎంపికైన స్కూళ్లకు బీఎస్‌ఎన్‌ఎల్ వారు ఉచిత నెట్ సదుపాయం కల్పించనున్నట్లు తెలిసింది. అయితే మారుమూల గ్రామాల్లో నెట్ సదుపాయం అందుబాటులో లేకపోతే టీచర్ల సెల్‌ఫోన్ నుంచి నెట్ వాడుకోనున్నట్లు సమాచారం.



నిజాంపేట స్కూల్‌లో ఏఐ పాఠాలు వింటున్న విద్యార్థులు

**విద్యార్థుల ప్రత్యేక శ్రద్ధ**



ఏఐ బోధన పట్ల విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. సైన్స్, గణితం విభాగాల్లో తమ అనుమానాలను నివృత్తి చేసుకుంటున్నారు. ముఖ్యంగా చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తున్నాం. రెండో దశలో 170కి పైగా స్కూళ్లలో ఏఐ బోధన త్వరలో ప్రారంభిస్తాం.

– రాధాకిషన్, డీఈఓ

# రోగులకు మెరుగైన సేవలందించాలి

**కలెక్టర్ రాహుల్‌రాజ్**

**హవేళిఘణాపూర్(మెదక్):** ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన రోగులకు వైద్యులు ఓపికతో వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని సర్దన పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆస్పత్రిలో మందుల స్టాక్ వివరాలు, సిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా? అని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్యారోగ్యశాఖ మెదక్ ఆస్పత్రుల పనితీరును మెరుగుపరిచి ప్రజల విశ్వాసాన్ని చూరగొంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రసవాల సంఖ్య పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆయన వెంట వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

**సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి**

**మెదక్ కలెక్టరేట్:** సీఎం ఆదేశాలను జిల్లాలోని అధికారులంతా పాటించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన వీడియో



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ నగేష్, డీఎంహెచ్‌ఓ శ్రీరాం, సివిల్ సప్లై డీఎం నిత్యానంద్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్‌తో కలిసి హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ఫర్టిలైజర్ షాపులకు రెవెన్యూ, పోలీస్ అధికారులను నియమించే విధంగా వివరాలు ఇవ్వాలని వ్యవసాయ అధికారికి సూచించారు. రేషన్ కార్డుల పంపిణీ, నీటి నిల్వల రోజు వారి వివరాలు, ప్రజారోగ్య పరిరక్షణ, మున్సిపాలిటీలో శానిటేషన్ ఫాగింగ్ సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

# కేసీఆర్ హయాంలోనే అద్భుత ప్రగతి

**మాజీ మంత్రి హరీశ్‌రావు**

**చేగుంట(తూప్రాన్):** కాంగ్రెస్ పాలనను ప్రజలు గమనిస్తున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. చేగుంటలోని మహంకాళి ఉత్సవాలకు హాజరై మాట్లాడారు. కేసీఆర్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లాను అన్నివిధాల అభివృద్ధి చేశామన్నారు. తూప్రాన్, రామాయంపేటను డివిజన్ కేంద్రాలుగా చేసినట్లు తెలిపారు. మెదక్‌కు రైలు, రామాయంపేట, చిన్నశంకరంపేట వరకు కాల్వల నిర్మాణం చేపట్టామన్నారు. చేగుంట, తూప్రాన్ ప్రాంతాలను పారిశ్రామిక వాడలుగా అభివృద్ధి చేశామని వివరించారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, నాయకులు శ్రీనివాస్, రాజిరెడ్డి, నారాయణరెడ్డి, అలీం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరీశ్‌రావు

# తప్పుడు హామీలు.. కాంగ్రెస్ మోసాలు



కాంగ్రెస్ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి**

**కౌడిపల్లి(నర్సాపూర్):** అమలు కాని తప్పుడు హామీలిచ్చి ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని ఎమ్మెల్యే సునీతారెడ్డి విమర్శించారు. సోమవారం కౌడిపల్లిలో కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేర గా, పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అంటూ ప్రజలను మోసం చేసిందన్నారు. అందుకే ఆ పార్టీకి చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నాయకులు సత్తాచాటి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సార రామాగౌడ్, నాయకులు దుర్గారెడ్డి, ఎల్లం, కుత్‌బొద్దీన్, శ్యాంసుందర్‌రావు, కాంతారావు, ప్రవీణ్‌కుమార్, అమర్‌సింగ్ పాల్గొన్నారు.

# కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**ఎమ్మెల్సీ అంజిరెడ్డి**

**సంగారెడ్డి ఎడ్యుకేషన్:** కేంద్ర ప్రభుత్వ పథకాలను గడప గడపకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్సీ మనమే గెలిచామని, వచ్చే లోకల్ బాడీ ఎన్నికల్లో కూడా బీజేపీ అభ్యర్థులు కచ్చితంగా గెలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అన్నివర్గాల ప్రజలు నిరాశలో ఉన్నారన్నారు. ప్రజల సమస్యల కోసం ముందుండి కొట్లాడే పార్టీ బీజేపీ మాత్రమేనని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉజ్వల యోజన కింద రూ. 12 లక్షల మందికి ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్నామన్న ఇందిరమ్మ ఇల్లు కూడా ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నిధులు ఇస్తున్నామన్నారు. ప్రతినెల ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ఉచిత బియ్యం కూడా కేంద్రం ఇస్తుందన్నారు. ప్రధాని మోదీ తెలంగాణ అభివృద్ధికి రూ. 12 లక్షల కోట్ల నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి ఏం లేదన్నారు. సమావేశంలో రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షురాలు గోదావరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్ రావు, మాజీ ఎమ్మెల్యే విజయపాల్, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, మాణిక్‌రావు, కులకర్ణి, దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

## రైతన్న.. పాములతో భద్రం



**సదాశివపేట రూరల్(సంగారెడ్డి):** వర్షాకాలం వచ్చిందంటే పాముల బెడద ఎక్కువగా ఉంటుంది. పొలాల్లో పని చేసే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాల్సిన సమయం ఆసన్నమైంది. జూలై నుంచి సెప్టెంబర్ వరకు పాములు, తేళ్లు, ఇతర విష కీటకాలు ఎక్కువగా తిరుగుతుంటాయి. పొలాలు, సొప్ప కుప్పలు, గడ్డివాముల్లో ఉండే కప్పలు, ఎలుకలను తినేందుకు తరచూ వస్తుంటాయి. రాత్రి సమయంలో అటువైపు ఎవరూ వెళ్లకూడదు. ఇళ్ల చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పిచ్చిమొక్కలు, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలి. అయితే ఎవరైనా పాము కాటుకు గురైతే నాటు వైద్యం, మంత్రాలను ఆశ్రయించకుండా గోల్డెన్ అవర్‌లో వెంటనే ఆస్పత్రికి తరలించాలి. పాముకాటు విరుగుడుకు వైద్యులు యాంటీ స్నేక్ వీనం ఇంజెక్షన్ ఇస్తారు. అయితే కొన్ని రకాల పాములు అత్యంత విషపూరితమైనవి ఉంటాయి. పాము ఏదైనా కరిచిన వెంటనే ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలని వైద్యులు సూచిస్తున్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**శివ్వంపేట(నర్సాపూర్):** మండలంలోని పలు గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాంబండ 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా విద్యుత్ నిలిపివేస్తున్నట్లు చెప్పారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలు, గిరిజన తండాల ప్రజలు సహకరించాలని కోరారు.

# మహాసభలను జయప్రదం చేద్దాం

**మెదక్ కలెక్టరేట్:** సీఐటీయూ రాష్ట్ర 5వ మహాసభలను డిసెంబర్ 7, 9 తేదీల్లో మెదక్‌లో నిర్వహిస్తున్నామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు, ఆహ్వాన సంఘం చైర్మన్ చుక్క రాములు తెలిపారు. సోమవారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను మెదక్‌లోని కేవల్ కిషన్‌భవన్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1970లో ఐక్యత, పోరాటం నినాదంతో సీఐటీయూ ఏర్పడి, కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. రైతాంగం, వ్యవసాయ కార్మికులు, దళిత, గిరిజన, వృత్తిదారుల పోరాటాలకు సంఘీభావంగా నిలబడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతుందన్నారు. మొదటిసారిగా మెదక్‌లో జరుగుతున్న సీఐటీయూ రాష్ట్ర మహాసభలకు 33 జిల్లాల నుంచి 1,000 మంది ప్రతినిధులు హాజరు కానున్నట్లు చెప్పారు. ఇందుకోసం విరివిరిగా విరాళాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘం వైస్ చైర్మన్ అడివయ్య, ప్రధాన కార్యదర్శి మల్లేశం, కోశాధికారి బాలమణి, కార్యదర్శులు నర్సమ్మ, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

# ఫుట్‌బాల్ సంరంభం

- అట్టహాసంగా జాతీయ టోర్నీ ప్రారంభం
- వెల్లువెత్తిన క్రీడోత్సాహం
- వర్గల్ నవోదయలో ఆటల కోలాహలం

**వర్గల్(గజ్వేల్):** జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు తెరలేచింది. ఆటల సంరంభం అట్టహాసంగా మొదలైంది. వర్గల్ నవోదయ వేదికగా మూ డు రోజుల పాటు కొనసాగే పోటీలు సోమవారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. భోపాల్, చండీఘర్, హైదరాబాద్, జైపూర్, లక్నో, పాట్నా, పూణె, షిల్లాంగ్ రీజియన్‌లుగా దేశ నలుమూలల నుంచి తరలివచ్చిన నవోదయ విద్యాలయాల క్రీడాకారులతో నవోదయ నిండుదనం సంతరించుకున్నది.

**అతిథులకు ఘనస్వాగతం**

టోర్నీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు, తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీపీ ఫల్గుణ, నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ అభిజిత్ బేరాను ఆతిథ్య నవోదయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వేదిక ముందు క్రీడా ప్రాంగణంలో పతాకావిష్కరణ, విద్యార్థుల మార్చిఫాస్ట్, ఓత్ టేకింగ్ కార్యక్రమాలు వరుసగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరింపజేశాయి. ముఖ్య అతిథులు టోర్నీ ప్రారంభించిన వెంటనే స్టేడియంలో ఆనందోత్సాహాలు మిన్నంటాయి. అరుపులు, కేరింతలతో స్టేడియం మార్మోగింది. ఈ సందర్భంగా జీపీ ఫల్గుణ ప్రసంగిస్తూ ఇతర ఆటల మాదిరి ఫుట్‌బాల్ పట్ల దేశంలో ఆదరణ పెరగాలని ఆకాంక్షించారు. డిప్యూటీ కమిషనర్ అభిజిత్ బేరా మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడావికాసానికి నవోదయ బాటలు వేస్తుందన్నారు.



గోల్‌గా మలిచే ప్రయత్నంలో షిల్లాంగ్, పూణె జట్ల క్రీడాకారుల హోరాహోరీ

**తొలిరోజు విజేత జట్లు**

టోర్నీ తొలిరోజు సోమవారం అండర్–17 విభాగంలో షిల్లాంగ్ రీజియన్ జట్టు, లక్నో జట్టును 2–0 గోల్స్‌తో ఓడించింది. పాట్నా జట్టు 6–0 గోల్స్‌తో భోపాల్‌ను, షిల్లాంగ్ జట్టు 8–0 గోల్స్‌తో పూణె జట్టును చిత్తు చేసింది. చండీఘర్ జట్టు 2–1 గోల్స్‌తో జైపూర్‌పై గెలిచింది. హైదరాబాద్, పూణె జట్ల మధ్య 1–1 గోల్స్‌తో, లక్నో, హైదరాబాద్ మధ్య 1–1 గోల్స్‌తో రెండు మ్యాచ్‌లు 'టై' అయ్యాయి.

**అండర్–15 విభాగంలో..**

అండర్–15 విభాగంలో పాట్నా బాలురు 10–0 గోల్స్‌తో భోపాల్‌ను, 10–0 గోల్స్‌తో హైదరాబాద్‌ను, షిల్లాంగ్ జట్టు 16–0తో జైపూర్‌ను చిత్తుగా ఓడించాయి. లక్నో జట్టు 4–1 గోల్స్‌తో హైదరాబాద్‌ను, చండీఘర్ 3–0 గోల్స్‌తో పూణె జట్టును ఓడించాయి.

## క్లుప్తంగా

### ఎరువుల షాపు యజమానికి షోకాజ్ నోటీసు



నిర్వాహకుడికి నోటీసు అందిస్తున్న వ్యవసాయ అధికారి

సాక్షి ఎఫెక్ట్

చేగుంట(తూప్రాన్): అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్న దుకాణదారుడికి అధికారులు షోకాజ్ నోటీసులిచ్చారు. సోమవారం సాక్షిలో అధికధరలకు యూరియా విక్రయాలు పేరిట కథనం ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ మక్కరాజీపేట పవనసుత ఫెస్టిసైడ్ దుకాణాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం నిర్వాహకులకు నోటీసును అందించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ హెచ్చరించారు.

### అనారోగ్యంతో హెచ్‌ఎం మృతి



గైని భూమయ్య

నారాయణఖేడ్: ఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటకు చెందిన గైని భూమయ్య(52) అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కాగా సోమవారం తెల్లవారు జామున అనారోగ్యానికి గురై మృతి చెందాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయన స్వగ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



పట్టుకున్న నిందితుడితో పోలీసులు

జహీరాబాద్ టౌన్: ఎండు గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కోహీర్ ఎస్‌ఐ.సతీష్ కథనం ప్రకారం... మండలంలోని దిగ్వాల్ గ్రామ పరిధిలో జాతీయ రహదారిపై సోమవారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. బైక్‌పై వెళుతున్న న్యాల్‌కల్ మండలం డప్పూర్ గ్రామానికి చెందిన మంగలి రవీందర్(32)ను అనుమానంతో తనిఖీ చేయగా అతని వద్ద 400 గ్రాముల ఎండు గంజాయి దొరికింది. గంజాయితోపాటు ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

### సెల్‌ఫోన్ల అప్పగింత



బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎస్‌ఐ

పెద్దశంకరంపేట (మెదక్): మండలంలో ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై ప్రవీణ్ రెడ్డి మొబైల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేస్తే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదును పరిశీలించి ట్రేస్ చేస్తున్నట్లు తెలిపారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు ఆధారాలతో ఫిర్యాదు చేయాలని సూచించారు.

### చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ నవీన్

చేర్యాల(సిద్దిపేట): ఇండ్లల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నవీన్ తెలిపాడు. సోమవారం స్టేషన్‌లో ఎస్‌ఐ కేసు సంబంధించిన వివరాలు వెల్లడించారు. చేర్యాల పట్టణ కేంద్రంలోని పెద్దమ్మగడ్డ కాలనీకి చెందిన బంగారు శ్యామల, ప్రమీల ఇండ్లలో ఈ నెల 18న రాత్రి చోరీ జరిగింది. బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపాడు. విచారణలో భాగంగా బాధితులకు మేనల్లుడు అయిన జీవన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా గతంలో జరిగిన గొడవలు, పాతకక్షలు మనసులో పెట్టుకుని దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 13 గ్రాముల బంగారు చెవికమ్మలు , 5గ్రాముల బంగారు ఉంగరం , మొబైల్, రూ.2వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# అడ్డగోలు నిబంధనలతో ఇక్కట్లు

**ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లకు మార్కింగ్**

- కూలిస్తేనే రెండో విడత బిల్లులు
- ముగ్గు పోసినప్పుడు చెప్పని అధికారులు
- నష్టపోతున్నామని లబ్ధిదారుల ఆవేదన



పోగుల సత్యం ఇంటి ముందు కూల్చిన ఇందిరమ్మ ఇంటి పిల్లర్లు

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వం తోటపల్లిని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి 125 మంది పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మొదటి విడతలో మంజూరు చేసింది. నిర్మాణాలు ప్రారంభించాలని అధికారులు ఒత్తిడి చేయడంతో ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో అధికారులు లబ్ధిదారులకు ముగ్గు పోశారు. కానీ ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించిన ఇళ్లకు అధికారులు బిల్లులు ఇవ్వకుండా ఇంటికి మార్కింగ్ వేయడంతో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పిల్లర్స్ తొలగిస్తేనే బిల్లులు ఇస్తామనడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

హుస్నాబాద్ డివిజన్ అక్కన్నపేట, కోహెడ, హుస్నాబాద్ మున్సిపాలిటీ, హుస్నాబాద్ మండలానికి మొదటి విడత 356, రెండవ విడతలో 1150 మొత్తం 1506 ఇళ్లు మంజూరైతే ఇప్పటి వరకు 1185 ఇళ్లకు అధికారులు మార్కింగ్ వేశారు. హుస్నాబాద్ మండలంలో 310 మంజూరైతే 212కు మార్కింగ్ ఇచ్చారు. మొదటి విడత తోటపల్లి గ్రామానికి 125 మంజూరు చేస్తే అందులో 54 మంది మాత్రమే నిర్మాణం చేపట్టారు. ఇందులో 17 ఇండ్లు ప్రభుత్వ నిబంధనలకు ఎక్కువ విస్తీర్ణంలో ఉన్నాయని చెప్పి బిల్లులు నిలిపివేశారు. ఇల్లు కంటి నోళ్ల పరిస్థితి చూసిన మిగితా లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి ముందుకు వస్తలేరు. అప్పుచేసి ఇల్లు కడితే ప్రభుత్వం సాకులు చూపించి బిల్లులు ఇయ్యకపోతే ఎట్లాఅని ఆందోళన చెందుతున్నారు. ఆగస్టు 2 వరకు మిగితా వారు పనులు ప్రారంభించకపోతే రద్దు చేస్తామని అధికారులు చెప్పినా బిల్లుల చిక్కులు తేల్చే వరకు ముగ్గులు పోయమని మొండికేస్తున్నారు.

**ఓ బాధితుడి ఆవేదన..**

తోటపల్లికి చెందిన గెంటె శేఖర్ భార్య కోమల పేరున ఇల్లు మంజూరు కావడంతో నిర్మాణం మొదలు పెట్టి లెంటల్ లెవల్ వరకు పూర్తి చేశాడు. 600 చదరపు అడుగులకు ఎక్కువ విస్తీర్ణంలో ఇల్లు నిర్మించారని అధికారులు బిల్లులు ఇవ్వడం లేదని శేఖర్ తన ఆవేదనను దుబాయి నుంచే గ్రామ వాట్సప్ గ్రూపులో పోస్టు చేశాడు. పైసా పైసా పోగు చేసి ఇల్లు కడితే అధికారులు బిల్లు ఇవ్వకపోవడమేంటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

**హామీ పత్రాలు రాసుకుని చెల్లింపులు**



ఎక్కువ విస్తీర్ణం తొలగించాలని అధికారులు ఇచ్చిన మార్కింగ్

తోటపల్లిలో ఇందిరమ్మ ఇల్లు 600 స్కేర్ ఫీట్లకు ఎక్కువ దాటి నిర్మాణం చేసుకోమని 17 మంది లబ్ధిదారులతో హామీ పత్రాలను పీడీ రాయించుకుని 10 మందికి మొదటి విడత బిల్లులు చెల్లించారు. ఇంటి నిర్మాణంలో ఎక్కువ ఉన్న పిల్లర్స్ తొలగించుకోవాలని వాటికి అధికారులు మార్కింగ్ ఇచ్చారు. మాకెందుకు బిల్లులు ఇవ్వడం లేదని మిగితా ఏడుగురు అధికారులను ప్రశ్నిస్తున్నారు. మరో ఇద్దరు 600 చదరపు అడుగులకు మించి నిర్మించిన ఇళ్లకు స్లాబు కూడా వేశారు. ఒక్కొక్క పిల్లర్ నిర్మాణానికి రూ.20వేల ఖర్చు వస్తుంది. ఒక ఇంటికి రెండు పిల్లర్స్ కూల్చితే రూ.10 వేల ఖర్చు, ఒక్కొక్క లబ్ధిదారుడికి రూ.50 వేల వరకు ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎక్కువ నిర్మాణం కూలిస్తేనే బిల్లు..**

నాకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో నిర్మాణం మొదలు పెట్టాం. అధికారులు మొదట 400 చదరపు అడుగులకు తగ్గకుండా 600కు మించకుండా ఇల్లు నిర్మించుకోవాలని చెప్పారు. కానీ, నేను కాస్త ఇల్లు ఇంటి ముందు పందిరిలాగా ఉండాలని కొద్దిగా ఎక్కువ నిర్మాణం చేస్తే 600 చదరపు అడుగులు దాటింది. దీంతో అధికారులు బిల్లు ఇవ్వమన్నారు. హామీ పత్రం రాసిస్తే మొదటి బిల్లు ఇచ్చిండ్రు. ఇప్పుడు ఎక్కువ కట్టిన పిల్లర్‌ను తొలగిస్తే రెండో బిల్లు వస్తదంటున్నారు.

- పోగుల సత్యం, తోటపల్లి

**మొదటి నుంచి చెబుతున్నాం**

ప్రభుత్వ నిబంధనల మేరకు ఇల్లు నిర్మాణం చేసుకోవాలని మొదటి నుంచి చెప్పాం. కొందరు అధికారుల మాటలు వినకుండా వారికి ఇష్టం వచ్చినట్టు నిర్మించారు. బిల్లులు రావాలంటే జియో ట్యాగింగ్ చేయాల్సి ఉంటుంది. ఎక్కువ విస్తీర్ణం ఉన్న ఇంటి ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే కావడం లేదు. 600 చదరపు అడుగులకు మించి నిర్మించుకోమని హామీపత్రం రాసిస్తేనే బిల్లు ఇచ్చాం. రెండో బిల్లు కావాలంటే ఎక్కువ భాగం తొలగించాలి.

-దామోదర్‌రావు, పీడీ హౌసింగ్



గ్రామస్తులు, అధికారులతో చర్చిస్తున్న ఎన్‌ఎల్‌ఎం బృందం సభ్యులు

## కేంద్ర ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా?

**ఎన్‌ఎల్‌ఎం బృందం సభ్యుల ఆరా**

చిలప్‌చెడ్(నర్సాపూర్): కేంద్ర ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? మంజూరు చేసిన పనులు ఏ విధంగా సాగుతున్నాయని నేషనల్ మానిటరింగ్ టీం లీడర్ సురంజన్‌రెడ్డి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని శీలాంపల్లి గ్రామంలో ఎన్‌ఎల్‌ఎం బృందం పర్యటించింది. అనంతరం వారు 2023–24, 2024–25 వరకు జరిగిన పనుల గురించి గ్రామస్తులతో, సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సురంజన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో జరిగిన పాంపాండ్, ఈజీఎస్ రోడ్డు పనులు, రోడ్డుకు ఇరు వైపులా నాటిన మొక్కలు, కార్యదర్శి నిర్వహించిన ఏడు రకాల రిజిస్టర్లు, ఆవాస్ యోజన పనులను పరిశీలించారు. పెన్షన్‌ను ఏ విధంగా వినియోగించుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సేకరించిన వివరాల తుది నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎల్‌ఎం టీం సభ్యుడు సాధిక్ అలీ, ఎంపీడీఓ ఖలీముల్లా, పీఆర్‌డీఈ అమరేశ్వర్, ఏపీఓ శ్యామ్, ఇరిగేషన్ ఏఈ హరీష్‌రెడ్డి, పీఆర్‌ఏఈ మారుతి, ఇన్‌చార్జ్ ఎంపీఓ తిరుపతి, గ్రామ కార్యదర్శి అఖిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పొలానికి వెళ్లిన యువకుడు అదృశ్యం



ప్రసాద్ యాదవ్

న్యాల్‌కల్(జహీరాబాద్): యువకుడు అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని గంగ్వార్ గ్రామంలో చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్‌ఐ చల్లా రాజశేఖర్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన గొల్ల ప్రసాద్ యాదవ్(24) రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి భోజనం చేసిన పొలం వద్దకు వెళ్లాడు. ఉదయం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ప్రసాద్‌కు ఫోన్ చేయగా మొబైల్ స్విచ్ఛాప్ వచ్చింది. దీంతో కుటుంబీకులు వెతికినా ఆచూకీ లభించలేదు. ప్రసాద్ యాదవ్ అన్న మహేందర్ యాదవ్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా అదృశ్యమైన ప్రసాద్ యాదవ్ హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం ఉందని ఎస్‌ఐ తెలిపారు. తీసుకున్న లోన్ డబ్బులు చెల్లించాలని కొందరు తీవ్రంగా ఒత్తిడి చేయడం వల్లే అతడు అదృశ్యమైనట్లు సమాచారం. అయితే అతను యాప్‌ల ద్వారా అప్పు తీసుకున్నాడా? లేక ఇతరుల వద్ద తీసుకున్నాడా? అనే విషయం తెలియాల్సి ఉంది.

**పెద్దశంకరంపేటలో తల్లీకొడుకు..**



కొడుకుతో శ్రీలత

పెద్దశంకరంపేట (మెదక్): తల్లీకొడుకు అదృశ్యమయ్యారు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రవీణ్ రెడ్డి కథనం ప్రకారం... పట్టణానికి చెందిన లింగాయపల్లి బూదెమ్మ కూతురు శ్రీలత(25)ను ఏడేళ్ల క్రితం మండల పరిధిలోని ఉత్తులూర్ గ్రామానికి చెందిన సాయిలుతో వివాహం జరిపించింది. వీరికి కుమారుడు శివ(5) ఉన్నాడు. కాగా, భర్త సాయిలు రెండేళ్లుగా ఇంటికి రాకపోవడంతో శ్రీలత, శివ ఇద్దరూ బూదెమ్మ దగ్గరే ఉంటున్నారు. గతనెల 8న ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఆమె తన కుమారుడిని తీసుకొని వెళ్లిపోయింది. బంధు మిత్రుల వద్ద విచారించినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. తల్లి బూదెమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రెండు రూపాయలకే షర్ట్..

- ఎగబడిన జనం..
- పారిపోయిన ఓనర్



నర్సాపూర్‌లో షాపు వద్ద యువకులు

నర్సాపూర్: కస్టమర్లను ఆకర్షించేందుకు వ్యాపారులు పలు రకాలుగా ప్రయత్నాలు చేస్తుంటారు. కొన్ని ప్రకటనలు వారిని ఇబ్బందులకూ గురి చేస్తుంటాయి. నర్సాపూర్‌కు చెందిన రెడీమేడ్ బట్టల దుకాణం యజమాని సోషల్ మీడియాలో వినూత్న ప్రకటన చేశారు. అది అసలుకే ఎసరు పెట్టడంతో దుకాణం మూసివేసి పారిపోయాడు. వివరాలు ఇలా... పట్టణానికి చెందిన వ్యాపారికి బస్టాండు సమీపంలో మెయిన్ రోడ్డుపై రెడీమేడ్ బట్టల షాపు ఉంది. ఈ దుకాణంలో రూ. 2కే షర్ట్ అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. దీంతో సోమవారం ఉదయం యువకులు ఆ దుకాణం వద్దకు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అందరు ఒకేసారి దుకాణం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో అక్కడ ఘర్షణ వాతావరణం ఏర్పడింది. తాను రెండు రూపాయలకు ఒక షర్టు పది నిమిషాలు మాత్రమే ఇస్తానని ఆ పోస్టులో చెప్పానని యజమాని అన్న కూడా అక్కడికి వచ్చిన కస్టమర్లు వినిపించుకోలేదు. దీంతో అందరికి షర్టులు ఇవ్వడం కష్టమవడంతోపాటు వారిని అదుపు చేయలేక పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చి దుకాణం మూసివేయించారు. దీంతో చౌకగా షర్ట్ కొందామని వచ్చిన వారు నిరాశతో ఇంటిముఖం పట్టారు.

## కడుపునొప్పి భరించలేక విద్యార్థిని ఆత్మహత్య



అఖిల

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన చిన్నకోడూరులో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... మండల పరిధిలోని చౌడారం మధిర గ్రామం ఎల్లమ్మజాలుకు చెందిన దానబోయిన రాజు– లక్ష్మి దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు అర్చన సిద్దిపేటలోని ప్రైవేటు ఆస్పత్రిలో పని చేస్తుండగా, రెండో కూతురు అఖిల(18) డిగ్రీ మొదటి సంవత్సరం, కుమారుడు హరీష్ ఇంటర్ చదువుతున్నారు. గ్రామంలో ఉపాధి లేక కొన్నేళ్లుగా చిన్నకోడూరులో నివసిస్తూ వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకున్నారు. కొద్ది రోజులుగా రెండో కూతురు అఖిల కడుపునొప్పితో బాధపడుతోంది. సోమవారం ఉదయం కూడా కడుపునొప్పి రావడంతో అమ్మానాన్న పొలం పనులు చేసుకొని వచ్చి ఆస్పత్రికి తీసుకెళ్తామని చెప్పి వెళ్లారు. అఖిలకు కడుపునొప్పి తీవ్రం కావడంతో భరించలేక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ఆస్పత్రికి తీసుకెళదామని తండ్రి ఇంటికి రాగా కూతురు ఉరేసుకుని కనిపించింది. వెంటనే కిందకు దించి సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సైఫ్ అలీ తెలిపారు.

## ఇంటి వద్దకే ఓటర్ కార్డు

**18 ఏళ్లు నిండిన వారు ఓటు నమోదు చేసుకోవాలి**

సంగారెడ్డి క్రైమ్: రానున్న ఎన్నికల్లో తమ ఓటు హక్కును అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా, పోలింగ్ శాతం పెంచేలా కేంద్రం ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు సంస్కరణలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుంటే నేరుగా ఓటర్ గుర్తింపు కార్డు ఇకనుంచి ఇంటికే రానుంది. ఓటింగ్ శాతం పెంచడంతోపాటు 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా కేంద్ర ఎన్నికల సంఘం ఆధునిక సాంకేతికతతో శ్రీకారం చుడుతుంది.

**మార్పులు, చేర్పులు..**

ఇది వరకే ఓటర్‌గా నమోదు చేసుకున్న జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి సైతం 7 నుంచి 15 రోజుల్లోనే ఇంటికి ఓటర్ కార్డు పంపించనున్నారు. ఇప్పుడున్న సాంకేతిక పరిజ్ఞానం ప్రకారం ఓటర్లకు ఎలక్ట్రోరల్ ఫొటో ఐడెంటిటీ కార్డు చేయడానికి నెల సమయం పడుతుంది. దీనికోసం ఎన్నికల సంఘం నూతన ప్రామాణిక నిర్వహణ విధానాన్ని తీసుకువచ్చిందని అధికారులు తెలిపారు.

**దరఖాస్తు చేసుకునే విధానం..**



ఓటరు కార్డు

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఈసీఐ.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ ఫోన్ నంబర్, ఈ మెయిల్ ఐడీతో సైన్ ఇన్ కావాలి. క్రియేట్ చేసిన అకౌంట్‌పై క్లిక్ చేసి తన పేరు, పాస్వర్డ్ నమోదు చేయాలి. సైన్‌అప్ అయిన ఈమెయిల్ ఐడీకి ఓటీపీ వస్తుంది. దానిని ఎంట్రీ చేసి అందులో ఓటర్ వివరాలు నమోదు చేసుకోవాలి. తర్వాత మొబైల్ నంబర్, పాస్వర్డ్ నమోదు చేసి ఓటీపీతో లాగిన్ అవ్వాలి. కొత్తగా ఓటర్ నమోదు చేసుకునేవారు ఫారం 6తో వ్యక్తిగత వివరాలు, అడ్రస్ తదితర వివరాలు నమోదు చేసి అందులో పేర్కొన్న ధ్రువపత్రాలను స్కాన్ చేసి అప్లోడ్ చేయాలి. వివరాలను సరిచూసుకొని సబ్మిట్ చేయాలి. ఓటర్ కార్డులో మార్పులు చేర్పుల కోసం ఫారం 8లో మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. ఫారం 7తో ఓటర్ పేరు తొలగించుకోవచ్చు. ఓటర్ నమోదుపై అవగాహన కల్పిస్తున్నామని సంగారెడ్డి తహసీల్దార్ జయరాం తెలిపారు.

## 11 మంది విద్యార్థినులకు అస్వస్థత

- దుర్వాసన వచ్చిన చికెన్ వండటంతోనే..
- కాంట్రాక్టు రద్దు చేసిన డీఈవో





చికిత్స పొందుతున్న విద్యార్థినులు, విద్యార్థినితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ప్రభుత్వ మోడల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మోర్గి మాడల్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థినులు ఆదివారం రాత్రి భోజనాలు చేశారు. అనంతరం వాంతులు, కడుపునొప్పితో బాధపడుతూ అస్వస్థతకు గురయ్యారు. వెంటనే హాస్టల్ ఇన్‌చార్జి, కస్తూర్బాగాంధీ స్పెషల్ ఆఫీసర్ రాజేశ్వరి రాత్రి ఖేడ్‌లోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా వీరికి చికిత్స అందించిన అనంతరం సోమవారం డిశ్చార్జి చేశారు. కళాశాలలో 68మంది విద్యార్థినులు ఉండగా 11మంది మాత్రం అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. హాస్టల్‌కు చికెన్ సరఫరా చేసే కాంట్రాక్టర్ ఉదయం కాకుండా సాయంత్రం చికెన్‌ను సరఫరా చేశారని, దాన్ని వండి వడ్డించినట్లు తెలిపారు. అస్వస్థతకు గురైన నికిత, సృజన, చంద్రకళ, భారతి, నందిని, శైలజ, విగ్నేశ్వరి, పూజలను ఆరోగ్యం కుదుట పడటంతో డిశ్చార్జి చేశామని పీడియాట్రిస్ట్ డా.అవినాష్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రమేష్ తెలిపారు. మరో ముగ్గురు విద్యార్థినులు లావణ్య, భవానీ, స్వాతిలను సాయంత్రం డిశ్చార్జి చేస్తామన్నారు. సాధారణ గ్యాస్ట్రిటీస్ ఉందని డా.అవినాష్ తెలిపారు.

**ఎమ్మెల్యే సందర్శన..**

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా.సంజీవరెడ్డి హుటాహుటిన సోమవారం ఉదయం ఆస్పత్రిని సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. వైద్యులు, మోడల్ స్కూల్ ఇన్‌చార్జి వార్డెన్ రాజేశ్వరిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. చికెన్‌ను ఆలస్యంగా తెచ్చిన కాంట్రాక్టర్‌పై చర్యలకు అధికారులకు నివేదించాలని సూచించారు. డీఈవో వెంకటేశ్వర్లు ఆస్పత్రిని సందర్శించి కారణాలు తెలుసుకొని విద్యార్థినులను పరామర్శించారు. ఉదయం చికెన్ సాయంత్రం ఇచ్చి నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్ కాంట్రాక్టు రద్దు చేస్తున్నామని, చికెన్ సాయంత్రం వచ్చాక దుర్వాసన వచ్చినా వండిన వంట వారిపై కూడా చర్యలు తీసుకోనున్నట్లు డీఈఓ తెలిపారు. ఆర్డీఓ అశోక చక్రవర్తి సైతం ఆస్పత్రిని సందర్శించి వివరాలు సేకరించారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఆస్పత్రిని సందర్శించి విద్యార్థులను పరామర్శించారు.

## స్కూటీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

**ఒకరు మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు**



మనోహరాబాద్: ఘటనా స్థలంలో మృతి చెందిన తేజ, చిత్రంలో ప్రమాదానికి కారణమైన బస్సు

మనోహరాబాద్(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు జరిగింది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం... ఏపీలోని అనకాపల్లి నియోజకవర్గం చౌడవరం మండలం బోగాపురం గ్రామానికి చెందిన కానుగ సముద్రం తన కుటుంబ సభ్యులతో కలిసి మేడ్చల్ మండలం గుండ్లపోచంపల్లి గ్రామంలో నివాసం ఉంటూ కంపెనీలో పని చేస్తున్నాడు. కాగా అతని కుమారుడు కానుగ తేజ , అతని మిత్రులు ప్రవీణ్, మురళి, లోకేష్‌లతో కలిసి ఆదివారం రాత్రి స్కూటీపై మనోహరాబాద్ మండలంలోని కూచారం గ్రామ శివారులో గల ఫామ్‌హౌస్‌కు వచ్చారు. ఉదయం తిరిగి గ్రామానికి వెళుతున్న క్రమంలో జాతీయ రహదారి –44పై మనోహరాబాద్ మండలం కాళ్లకల్ శివారులో రాఘవేంద్ర హోటల్ ముందర నుంచి నలుగురు స్కూటీపై వెళుతున్నారు. ఈ క్రమంలో కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో హైదరాబాద్ వైపు వెళుతుంది. కాగా డ్రైవర్ వేగంగా వెళుతూ అదుపుతప్పి ముందు వెళుతున్న స్కూటీని ఢీకొట్టాడు. దీంతో స్కూటీపై ఉన్న తేజ అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మురళి, ప్రవీణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుని బంధువు నాగవెంకట అప్పల నాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తేజ మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

**రోడ్డు ప్రమాదంలో తండ్రి,కూతురు..**

సిద్దిపేటఅర్బన్: రోడ్డు ప్రమాదంలో తండ్రి, కూతురు మృతి చెందారు. ఈ ఘటన మిట్టపల్లి శివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ ప్రకారం... బీహార్ రాష్ట్రం వైశాలి జిల్లా రహీమాపూర్ గ్రామానికి చెందిన మంతోష్‌కుమార్ 5 నెలల క్రితం తన భార్య ముగ్గురు కూతుర్లతో కలిసి బతుకుదెరువు కోసం సిద్దిపేట ప్రాంతానికి వచ్చాడు. చిన్నకోడూరు మండలం కస్తూరిపల్లికి చెందిన మూల జితేందర్‌రెడ్డి వ్యవసాయ బావి వద్ద పని చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. మంతోష్‌కుమార్ సోదరి, బావ వెల్కటూరు శివారులోని ఓ పౌల్ట్రీ పామ్‌లో పనిచేస్తుండగా వారిని కలిసేందుకు తన కూతురు ఝూన్సీతో కలిసి ఆదివారం రాత్రి యజమానికి చెందిన ఎలక్ట్రిక్ బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో మిట్టపల్లి శివారులోకి రాగానే వెనక నుంచి వచ్చిన స్విఫ్ట్ కారు ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మిట్టపల్లి గ్రామానికి చెందిన కొమ్మిశెట్టి మణిసాయిగా గుర్తించారు. నేరం నుంచి తప్పించుకోవడానికి మణిసాయి తన కారును మిట్టపల్లి సబ్‌స్టేషన్ వద్ద రోడ్డు పక్కన దాచిపెట్టాడు. మద్యం మత్తులో అతివేగంగా, అజాగ్రత్తగా కారు నడిపి ప్రమాదానికి కారణమైన మణిసాయిని పోలీసులు అరెస్టు చేశారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్థిక ఇబ్బందులు తాళలేక..



సాయికృష్ణగౌడ్

తూప్రాన్: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ–2 యాదగిరి వివరాల ప్రకారం ... పట్టణంలోని డబుల్ బెడ్రూంలో నివాసం ఉంటున్న చిన్నలింగు సాయికృష్ణగౌడ్(29) ఆటో డ్రైవర్. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 18న ఇంట్లో గడ్డిమందు తాగి అపస్మారక స్థితిలో బంధువులకు ఫోన్ చేశాడు. వెంటనే వారు ఘటనా స్థలానికి చేరుకొని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**చికిత్సపొందుతూ వ్యక్తి..**



ఇస్మాయిల్

జహీరాబాద్ టౌన్: చిక్సిత పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐ.వినయ్‌కుమార్ వివరాల ప్రకారం... హైదరాబాద్‌లోని బేగంపేట ప్రాంతానికి చెందిన ఎండీ. ఇస్మాయిల్ పట్టణంలోని రాంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. హమాలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని మహేశ్వరీ సినిమా హాల్ సమీపంలో స్పృహ తప్పి పడిపోయి ఉన్నాడు. విషయం తెలుసుకున్న మిత్రులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఇస్మాయిల్ రాత్రి మృతి చెందాడు. మృతుడి అన్న ఎండీ. అఖిల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.